నెహ్రూ బాలల పుస్తకాలయం

కాశ్మీరు

రచన

మాలా సింగ్

ఛాయా చిత్రాలు

పి. ఎస్. శర్మ

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

ISBN 81-237-0411-9

ప్రథమ ముద్రణ 1970 (శక 1892)

తృతీయ ముద్రణ 1993 (శక 1914)

Kashmir *(Telugu)*

రూ. 6.50

డైరక్టరు, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, ఎ-5, గ్రీన్ పార్క్,
కొత్త ఢిల్లీ-110016 చే ప్రచురించబడినది.

కాశ్మీరు

తెల తెలవారుతూ ఉంది......

సూర్యకిరణాలు కొలని నీలి నీటిని తాకుతున్నాయి. ఆ నీరు మేలిమి బంగారంలోకి మారుతూ ఉంది. ఆకు పచ్చ తామరాకులు, రెల్లు కాడల మధ్య దూసుకు వస్తూన్న చేపల తోకలూ ఎండకి తళుక్కుమని మెరుస్తున్నాయి. లకుముకి పిట్ట, ఎలుగుబంటి గాఢనిద్ర నుంచి మేల్కొంటున్నాయి.

అలా కాశ్మీరులో మరో రోజు ప్రారంభమయింది........

కాశ్మీరు ఒక లోయ. సముద్ర మట్టం నుంచి 5000 అడుగుల ఎత్తున ఉన్నది. ఈ లోయ చుట్టూ మంచు కప్పిన ఎత్తైన



కొండలు వున్నాయి. ఝీలమ్‌నదీ, దాని ఉపనదులూ కాశ్మీరు లోయకంతకీ నీటినిస్తాయి. కాశ్మీరు సౌందర్యం అసంఖ్యాక జనాన్ని ముగ్ధుల్ని చేసింది.

అడవి బూరుగు చెట్లు బారులు తీర్చిన బాటలు, కొండ ప్రక్కల నుంచి జాలువారే సెలయేళ్ల గలగలలు, పుష్ప సమృద్ధివల్ల పూలపాన్పులలాగా కనిపించే మైదానాలు—ఈ లోయ సౌందర్యం ఇంతింత కాదు. ప్రపంచంలోని నలుమూలల ప్రజల్ని ఈ సౌందర్యం ఆకర్షిస్తున్నది. ఈ ఆకర్షణ శక్తిని గ్రహించి భారత ప్రభుత్వము దీన్ని దేశమంతటిలో సుప్రసిద్ధ యాత్రా స్థలంగా అభివృద్ధి పరిచింది. అందువల్ల అమెరికన్, ఫ్రెంచ్, జర్మన్ యాత్రికులతో ఈనాడు పంజాబీలు, గుజరాతీలు, మద్రాసీలు, బెంగాలీలు వేసవి మాసాలలో కలిసి మెలిసి తిరగటంలో ఆశ్చర్యమేమీ లేదు.

'మహమ్మద్' పదేళ్ల చిన్నవాడు. కానీ తివాచీలు నేసే కళలో నిపుణత సంపాదించాడు. తన అన్నలిద్దరితోపాటు పొద్దుపొడిచేటప్పటికే పని ప్రారంభం చేస్తాడు. ఈ ముగ్గురూ నీలి ఎరుపు రంగులు కలిసిన పూలు ఒక తెల్లని తివాచీ మీద అతి చక్కగా మగ్గం వేస్తున్నారు.





ఈ నేర్పు వీరికి తాతల నాటినుంచీ సంక్రమించింది. వీరి కుటుంబం ఆరు తరాలనుంచీ తివాచీలు నేయటంలో పేరు పొందారు. ఆ పేరుని నిలబెట్టుకున్నందుకు ఈ ముగ్గురు బాలురు గర్విస్తున్నారు.

ఈనాడు కాశ్మీరుకు పేరుతెచ్చిన అనేకరకాల కళలకు, చేతి పనులన్నిటిలాగే, ఈ తివాచీ నేతపని కూడా పదిహేనో శతాబ్దినాటి జనప్రియుడైన కాశ్మీర్ రాజు జైన్-ఉల్-అబ్దిన్ ప్రవేశపెట్టిందే. తొలి రోజుల్లోని నమూనాలు పర్షియన్ సంప్రదాయ ప్రధానమైనవేగాని, కాలక్రమాన కాశ్మీర్ హస్తకారులు సొంత నమూనాలు సృష్టించుకొని తండ్రినుంచి కొడుకుకి సంక్రమించిన ఈ విద్యలో పరిపక్వతను సంపాదించారు.

ఈ తివాచీలు రెండు రకాలు. పై వైపున నునుపుగా ఉండే రకం ఒకటి, రెండో రకం బొచ్చుగా వుండేది. కాశ్మీరులో ఆనవాయితీగా పెంచే ఒక ప్రత్యేక జాతి గొఱ్ఱెల నుంచి తీసిన అతి సున్నితమైన ఊలుతోనే ఈ తివాచీలు నేస్తున్నారు.







ఎనిమిదేళ్ల అయేషా ఆ బాలిక చెల్లెళ్ళూ, తెల్లవారే లేచింది మొదలు పగలంతా ఎంతో పని చేయవలసిందే. వాళ్ళు ఒల్లపై వేసే గుడ్డ మీద బుటేదారి పని చేస్తున్నారు. వారిలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధమైన ప్రత్యేక

డిజైనులో ప్రవీణులే. వారంతా కలిసి చేసే ఈ చక్కని గుడ్డలే భారతదేశ మంతటా వేలాది ఇండ్లలోని బల్లలని అలంకరిస్తున్నాయి.

అహమ్మదు బాగా ముసలివాడు. అయినా, ఆరుబైట ఆ ఎత్తు బల్లపై కూర్చుని అప్పుడే పని ప్రారంభించాడు. అతడు కాగితం గుజ్జుతో వస్తువులను చాలా రకాల డిజైన్లలో తయారుచేస్తాడు. అతనిది కళాహృదయం. తన



జన్మభూమి సౌందర్యాన్ని ఆకళించుకున్నాడు కాబట్టి దానికి అమరత్వాన్ని కలుగజేయాలనుకొంటాడు. అతడు శరత్కాలంలో ఎర్రని ఎరుపు రంగుకు మారే చెనార్ చెట్ల ఆకుల ప్రతిరూపాలను కుంచెతో నిర్మిస్తాడు. అలాగే ఐరిస్, గులాబి, చెర్రీ పూలనూ, వసంతకాలంలో శ్వేతవర్ణాల విస్తారతతో ఉండే బాదం, ఆపిల్ పండ్లనూ ప్రతిబింబిస్తాడు. అదే విధంగా సరస్సుమీద విహరించే లకుముకి పిట్టల నీలి ఆకుపచ్చ రంగులనూ, అడవి బూరుగు చెట్ల మీద వాలి ఉన్న పికిలి పిట్టల ఎర్రదనాన్నీ ప్రతిబింబిస్తాడు. పర్షియనులు కాగితం గుజ్జు బొమ్మలను చేయటం మొట్టమొదట ప్రారంభించారు. నిర్ణీతాకారం గల కఱ్ఱమూస లోకి పొరలు పొరలుగా మెత్తిన కాగితం గుజ్జును ఒక ఆకారానికి తెచ్చి వస్తువులను తయారు చేస్తారు. తరువాత ఆ వస్తువుకు మెరుగుపెట్టి రంగు వేస్తారు.





ఆ దరిదాపులనే కఱ్ఱపై నగిషీలు చెక్కే మనిషి ఉంటాడు. అతడు రోజువారి వాడకపు వస్తువులను ఉలితో కళాత్మకమైన వస్తువులుగా మారుస్తాడు. అతని పనితనంతో కుర్చీలు, బల్లలు, సిగరెట్ పెట్టెలు వగైరా స్వరూపాలే మారి పోతాయి. వాటిపై చెనార్ చెట్ల ఆకులూ, ద్రాక్షగుత్తులూ, ఐరిస్, కలవపూలూ చెక్కుతాడు. ఉపరితలం కఠినంగా ఉండి మెత్తగా, నున్నగా ఉండే లేత రంగుల గుర్తులున్న అక్రోటు కర్రనే ఇందుకు సాధారణంగా వాడతారు. అక్రోటు చెట్లను కాశ్మీర్ అడవులన్నిటిలోనూ పెంచుతున్నారు. వీటివిలువ అక్కడివారికి

ఇప్పుడిప్పుడే బాగా తెలిసి వచ్చింది. ఎందుకంటే, అనేక ఆధునిక ఔషధాలకు పనికివచ్చే విలువగల మూలికలూ, కర్పూర తైలం తయారీలో వాడే సర్జరసమూ, ఈ అడవులనుంచే దొరుకుతున్నాయి. సర్వసాధారణంగా కాశ్మీరదేశంలో ఆకుపచ్చ బంగారం అనబడే ఈ అడవులను జాగ్రత్తగా పరిరక్షించి అందుకై పరిశోధనలను ప్రోత్సహిస్తున్నారు.

తివాచీ నేత, బుటేదారిపని, కాగితం గుజ్జు బొమ్మల తయారీ, కఱ్ఱ నగిషీ పని – ఇవన్నీగాక, కాశ్మీరీ శాలువ ప్రపంచ ప్రఖ్యాతి సంపాదించింది. సీజర్ సార్వభౌముని దర్బారులో కాశ్మీరు శాలువలను అమూల్య వస్తువులుగా పరిగణించేవారు. అదేకాక, ఈ శాలువలను ఆఫ్గన్ మొగలు రాజులు దూర దేశాలకు పంపేవారు. ఈ శాలువలు 'పష్మిన' అనే లదాక్ ప్రాంతంలో దొరికే ఒకరకం జాతిగొఱ్ఱె బొచ్చుతో తయారవుతాయి. నెపోలియన్ మహారాజు కాలంలో వాటికి ఫ్రాన్సులో గిరాకీ ఎక్కువయింది. తరువాత యూరపు ఖండ మంతలోనూ ప్రఖ్యాతి గాంచింది. అయితే ఆ శాలువలకు వచ్చిన గిరాకీ వాటిని తయారుచేసిన కాశ్మీరు పనివారిని భాగ్యవంతులు చేయలేదు. వీటిని విక్రయించిన వర్తకులే లాభించారు. వారు హుక్కాలలో నీటికి బదులు పాలనే వాడేటంత భాగ్యవంతులయ్యారు.

మల్బరీ చెట్లు కాశ్మీరు గ్రామీణ ప్రాంతాలంతటా ఉన్నాయి. వ్యవసాయపు పనులు లేని కాలంలో ఈ చెట్ల ఆకులను పట్టుపురుగులకి ఆహారంగా వేసి సిల్కుని తయారు చేయటం లాభసాటివృత్తిగా ఉందని గ్రహించిన వేలాది గ్రామీణులు ఈ చెట్లను పెంచుతున్నారు. ఈ పరిశ్రమ వందల సంవత్సరాల పూర్వం నుంచీ ఉంది. మొగలాయీల కాలంలో అంతఃపుర స్త్రీలు నున్నగా మెత్తగా ఉండే ఈ సిల్కు వస్తువులంటే మోజుపడే వారని చెబుతారు. కాని 1878 లో చీడపురుగు ఈ పరిశ్రమను ఇంచుమించు ధ్వంసం చేసింది. కొన్ని ఏళ్ళ తరువాత కాశ్మీర్ దేశస్థుడొకడు కాబూలు పోయి కొన్ని పాస్ల విత్తనాలు సేకరించి సీమబాదం కాయ డొల్లలలో వాటిని దాచి రహస్యంగా కాశ్మీరుకు చేరవేశాడని చెబుతారు.

ఈ నాడు ఈ పరిశ్రమను ఆధునికంచేశారు. శ్రీనగరం, జమ్మూలలో సిల్కు దారాన్ని తీసే అధునాతన యంత్రాలను ఏర్పాటుచేశారు.

సూర్యుడు ఆకాశంలో పైకి లేస్తున్నాడు. స్త్రీ పురుషులు, బాల బాలికలు, మోకాటి లోతు నీరున్న పొలాలలో వంగి వరి నాటుతున్నారు చూడండి! జమ్మూ కాశ్మీరులలో నూటికి ఎనభైమంది గ్రామీణులు వరిసాగుమీద ఆధారపడి బ్రతుకుతున్నారు. ఇటీవల తవ్విన వ్యవసాయ కాలవలు ఇంతవరకు మరుభూమిగా ఉన్న ప్రదేశాలనన్నిటినీ వరి, గోధుమ పంటలతో కళ కళలాడేటట్లు మార్చివేశాయి. ఇక్కడ వరి అతి ముఖ్యమైన పంట. ఎక్కువ రాబడినిచ్చే వరి రకాలను ప్రవేశపెట్టడం, నీటిపారుదల సౌకర్యాలను అభివృదిపరచడం,







ఎరువులను క్రిమిసంహారక ఔషధాలను వాడటం, ఇత్యాది కారణాలవల్ల, భారత దేశంలో కల్లా కాశ్మీరులో వరి అద్భుతంగా పెరుగుతోంది. ఇక్కడి నేల గుల్ల నేల. అందుమూలంగా నాట్ల సమయం నుంచి కోతల కాలం వరకూ చేలల్లో ఎక్కువ నీరు నిల్వచేయటం అవసరం. కాశ్మీరులో ముఖ్యమైన ఇతర పంటలు గోధుమ, మొక్కజొన్న. అయితే లదాక్ ప్రాంతంలో మాత్రం 'గ్రిమ్' అనే ఒక రకం బార్లీపంటను విస్తారంగా పండిస్తున్నారు.

కాశ్మీరు ఫలసమృద్ధి కూడా ఉన్న ప్రాంతం. వసంతంలో తెలుపూ, పాటలవర్ణాల పూలచెట్లు, డెఫొడిల్, ఐరిస్, కుంకుమ పూల మైదానాల పక్క బారులు తీర్చి కనిపిస్తాయి. కొద్దికాలంలో ఈ పూలన్నీ రాలి, వాటి స్థానే రస భరితమైన బేరీపండ్లు, ఆపిల్ పండ్లు, రేగుపండ్లు, పీచ్‌పండ్లు వేళ్లాడుతుంటాయి. గడచిన ఏభై యేళ్లలోనూ రకరకాల యూరప్ దేశపు పళ్ల అంట్లుకూడా వాడుక లోకి వచ్చాయి.

అదిగో ! దూరంగా అక్కడ పంపూరు కుగ్రామం కనిపిస్తోంది. అక్కడ పొలాలలో కుంకుమపూలు పండిస్తున్నారు. అబ్బ ! ఆ పొలాలు ఎంత అందంగా






మెరిసిపోతున్నాయి ! ఈ పూలని కాశ్మీరులో 'కేసరి' అంటారు. మొత్తం భారతదేశంలో కుంకుమపువ్వు ఇక్కడ మాత్రమే పెరుగుతుంది. ఈ పంట సాగుకు చిన్న చదరాలుగా విభజించిన మళ్లతో ఏటవాలుగా ఉండే ఒక రకం కొండనేల అవసరం. ఒకసారి ఈ దుంపను నాటితే పధ్నాలుగు సంవత్సరాల వరకు దానివైపు కన్నెత్తి చూడనక్కరలేదు. పాత పాయలు కుళ్ళి పోతుంటే కొత్తవి తమంతతామే మొలకెత్తుతుంటాయి. అక్టోబరులో పూలు పూస్తాయి. ఆ సమయంలో పంపూరు గ్రామమంతా ఎఱ్ఱటి తివాచీపరచినట్లుగా కనిపిస్తుంది. ఆ ప్రదేశమంతా కుంకుమపువ్వు సువాసనలు ఘుమఘుమ వెదజల్లుతుంటుంది. కుంకుమపువ్వు ఎంతో ఉపయోగకరమైనది. దాన్ని మందులలో మూలికగా వాడతారు; పూజా పునస్కారాల సమయంలో ఉపయోగిస్తారు. ప్రత్యేకమైన పంటకాలలో ఉపయోగిస్తారు. తాంబూలాలలో కూడా సేవిస్తారు.

కొండలమీది దట్టమైన అడవులలో దేవదారు, సిందూర, ఫర్ చెట్లు పెరుగుతాయి. వాటి మధ్య అడివి పూలతో నిండిన చక్కని మైదానాలు కానవస్తాయి.

అక్కడ గొఱ్ఱెల కాపరులు గొఱ్ఱెల మందను మేపటం చూడవచ్చు. దూరాన కదిలి పోయే మబ్బుల్నీ, సుదూరాన కొండ కోనలమీది మంచునీ గొఱ్ఱెకాపరి ఏదో కలలుకంటూ చూస్తూ కూర్చుంటాడు. గొఱ్ఱెలూ, మేకలూ, డైజీ, ఐరిస్, వైలెట్, ఫరగెట్-మి-నాట్ అనే అడవిపూల మధ్య పెరిగిన గడ్డిని మేయటంలో నిమగ్న మయివుంటాయి. శాలువల, నామ్ధాల, గుబాల, తివాచీల నేతకు ఉన్ని చాలా అవసరమైన ముడి పదార్థం కాబట్టి అందుకోసం రకరకాల సీమ గొఱ్ఱెలను పెంచుతారు.

మొత్తం భారతదేశంలో, లదాక్ ప్రాంతంతో కలిసిన జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం చాలా పెద్ద రాష్ట్రాలలో ఒకటి. దేశానికి ఉత్తర సరిహద్దున ఉన్నందువల్ల ఈ ప్రదేశం తీవ్ర వాతావరణ పరిణామాలకు గురి అవుతుంది. జమ్మూలో అత్యుష్ణంగా ఉంటే, కాశ్మీరు లోయలో సమశీతోష్ణం కలిగి వాతావరణం చల్లగా ఉంటుంది. ఆ సమయంలోనే లదాక్‌లో ఎముకలు కొరికే చలి! ఈ పరిస్థితులు, అక్కడి ప్రజల వేషభాషలను ఆచారవ్యవహారాలను ప్రభావితం చేస్తున్నాయి.





జమ్మూ పల్లె ప్రాంతాలలో మామిడి తోపులు చాలా వున్నాయి. ఇక్కడి జనం ఎంతో చురుకుగా, దిట్టంగా ఉంటారు. వారు డోగ్రేభాషను మాట్లాడుతారు. ప్రఖ్యాతమైన మనోహరమైన భంగ్రా నృత్యం వారి ఉద్వేగాన్ని సూచిస్తుంది.

అటు ఉత్తర భాగాన నివసించే ప్రజలు నాజూకుగా, తీర్చి దిద్దిన, కనుముక్కు తీరు కలిగి వుంటారు. పైన వదులైన లాల్చీ, కింద 'సల్వారు' అనే వదులు లాగూ వీరి దుస్తులు. స్త్రీలు ఒక చిన్న టోపీని ధరిస్తారు. శాలువా కానీ, దుప్పటి కానీ, తలమీదా బుజాలమీదా వేసుకుంటారు. మగవారు 'పుచ్చెటోపీ' పెట్టుకుంటారు. చలికాలంలో 'కాంగ్రే' ధరిస్తారు. ఈ కాంగ్రే ఒక రకమైన మట్టిజాడీ. దాని



చుట్టూ చువ్వలతో అల్లిన అల్లిక ఉంటుంది. దాంట్లో మండుతున్న ఎఱ్ఱని బొగ్గులను వేస్తారు. ఆ బొగ్గులు కాలుతూ కొద్దిపాటి వెచ్చదనం ఇస్తుంటాయి.

కాశ్మీరు స్త్రీలు అందానికి పెట్టింది పేరు. క్రీస్తుశకం పదిహేడవ శతాబ్దంలో 'బెర్నియర్' అనే ఫ్రెంచి దేశస్థుడు కాశ్మీరు రావటం సంభవించింది. అక్కడి స్త్రీల అందం గురించి విని, వారిని చూడాలనే ఆతురతతో, తను ఒక పర్షియా రాజకుమారుణ్ణనీ, రాకుమార్తె కావాలనీ బొంకాడట. అతని యుక్తి ఫలించి, అనేకమంది సౌందర్యరాసుల్ని చూడటం తటస్థించింది. ఈ సంఘటనని వర్ణిస్తూ, కాశ్మీరు స్త్రీలు సౌందర్యంలో, వారికి వారే సాటి అని, అతను ఒక పుస్తకంలో పేర్కొన్నాడు.





కాశ్మీరులో ఎక్కువ మందికి నచ్చిన పానీయం తేనీరు. దీనిని జనం ఎక్కువగా సేవిస్తారు. భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో త్రాగే తేనీటికీ కాశ్మీరులో త్రాగే తేనీటికీ ఎంతో వ్యత్యాసం ఉంది. ఈ తేయాకుతో కొంచెం సోడా బైకార్బనేట్ ని కలిపి చాలాసేపు మరగబెట్టి, అందులో రుచికోసం కొంచెం పాలు కలుపుకొని తాగుతారు. దీనిరంగు ముదురు గులాబీరంగులో వుంటుంది. ఇందులో పంచదారకు బదులు ఉప్పు కలుపుకొంటారు.



కొండలలో సంచరిస్తూ నివసించే గజ్జర్ అనే దిమ్మరి జాతివారి సంచార విధానంలోను జీవన విధానంలోనూ ఒక నిగూఢత్వం, మాయా మర్మం కానవస్తాయి. వేసవి సమయంలో వారు జమ్మూలోని ఉష్ణప్రాంతాల వారి గొఱ్ఱెల మేకల మందలతో చల్లదనంకోసం కాశ్మీరు తరలిపోతారు. వారు గట్టిశరీరం కలవారు. వీరి ఆహారం జొన్నరొట్టె, వెన్న, పాలు. ఈ ఆహారం మూలంగానే వీరు ఎంతో ఆరోగ్యంగానూ, దృఢంగానూ ఉంటారు.

బాగా ఉత్తరాన లదాక్ ఉంది. ఇక్కడ ఒక వింత నృత్యం చేస్తారు. పగటి వేషగాళ్లలాగా, ముఖాలకి తొడుగులు వేసుకొని చేయాలి ఈ నృత్యం. మత సంబంధమైన ఉత్సవాలలో ఈ నృత్యం తప్పనిసరి. వారి నృత్యం బౌద్ధుల ప్రవేశానికి పూర్వమున్న రాక్షసులమీద పద్మసంభవునికి కలిగిన విజయాన్ని వర్ణిస్తాయి.



లదాక్ ప్రపంచంలో నివాస స్థలాలన్నిటిలో అతి ఉన్నతి గలది. అక్కడి ప్రజలలో అత్యధిక భాగం 12000-15000 అడుగుల ఎత్తున నివసిస్తారు. మొత్తం మీద ఆ ప్రాంతమంతా సువిశాలంగా, అతి శీతలంగా, ఎగుడు దిగుడుగా ఉంటుంది. ఒకవిధమైన నిరామయత్వం, సౌందర్యం ఆ ప్రాంతాన్ని ఆవరించుకుని వుంటాయి. లదాక్ పూర్వచరిత్ర టిబెట్ పూర్వ చరిత్ర వంటిదే అయినా బౌద్ధమత సంబంధం వల్ల అది భారతదేశంతో సన్నిహిత సంబంధం నిలుపుకొన్నది. అక్కడి ప్రజలు మంగోలియన్ రూపు రేఖలతో పొట్టిగా ఉంటారు. దవడ ఎముకలు ఎత్తుగా వుంటాయి. వారు పొడుగాటి గౌనులు తొడుగుతారు. చెవులు కప్పే ఉన్ని టోపీలు పెట్టుకుంటారు. జడలబర్రెకూ, ఆవుకూ కలిగిన 'ఝో' అనే సంకర జంతువుతో పొలాలు దున్ని వ్యవసాయం చేస్తారు. వారి ప్రధానాహారం ఒక






రకం బార్లి. ఆ గింజలని పొడిచేసి, తేయాకుతో, వెన్నతో కలిపి పుచ్చుకొంటారు. తేనీరు తయారుచేయటంలో వారిది ప్రత్యేకమైన పద్ధతి. చిక్కని తేనీటిని సోడాతో కలిపి, ఉప్పువేసి, వెన్నతో దానిని చిలికి మీగడలాగా తయారుచేసి సేవిస్తారు.















లదాక్‌లో పెళ్లి తతంగం తమాషాగా వుంటుంది. ఒక స్త్రీ ఒక భర్తకంటె, ఎక్కువమందిని కలిగి వుండవచ్చు. దీనిని బహు భర్తృకత్వం అంటారు. ఈ ఆచారం కేవలం అన్నదమ్ముల కూటమికే పరిమితమైంది. పెళ్ళికాగానే పెద్ద కొడుకు కుటుంబాస్తికి వారసుడవుతాడు. ఆ విధంగా కుటుంబాస్తి పంపకం అయి చీలిపోకుండా తరతరాలకూ అలాగే వుండిపోతుంది.

విద్యా వైజ్ఞానిక రంగాలలో కూడా జమ్మూ కాశ్మీరు రాష్ట్రం ఎంతో ముందడుగు వేసింది. ప్రతి సంవత్సరం, విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది.






ఓనమాల దగ్గరనుంచీ పట్టభద్రత వరకూ విద్య ఉచితంగా లభిస్తున్న రాష్ట్రం భారతదేశం మొత్తంలో బహుశా ఇదొక్కటేనేమో.

ఆరోగ్యరంగంలో కూడా చాలా అభివృద్ధి చెందింది. ఊరూరా తగిన సిబ్బందిగల ఔషధశాలలూ, వైద్యశాలలూ, సాధన సామగ్రితోసహా తెరిచారు. ఇరవైయేళ్ల క్రిందట ఒక కాశ్మీరు వ్యక్తి ముప్పైరెండేళ్లకు పైకాలం బ్రతికేవాడు కాదు. కానీ ఈ రోజు అతని కా భయం లేదు. తన మనుమల్ని చూసుకునేంత దీర్ఘాయుష్మంతుణ్ణని అతనికి తెలుసు. అంతేకాదు, ఆ మనుమలు పెరిగి పెద్దయి జీవనోపాధి చేసుకోవటం కూడా చూడగలననే ఆశ వుంది.

కాశ్మీరు దేశపు చరిత్ర



కాశ్మీరు పుట్టుక వైనం ఇప్పటికీ ఎవరికీ తెలియదు. కాశ్మీరు ప్రాంతం ఒకప్పుడు కాశ్యపమహర్షి వట్టి చేసిన సరోవరమని సంప్రదాయజ్ఞు లంటారు. ఆ ఋషి గౌరవార్థం ఆ ప్రాంతానికి 'కాశ్యపమర్' అని పేరుపెట్టగా క్రమంగా అది "కాశ్మీరు" గా మారిందట.

పన్నెండో శతాబ్దపు చరిత్రకారుడైన కల్హణుడి ద్వారా కాశ్మీరు పూర్వ చరిత్ర కొంత తెలుస్తున్నది. ఆయన ఈ చరిత్రను పద్యరూపంలో వ్రాశాడు. అదే "రాజతరంగిణి", అంటే "రాజుల నది". అది మూడువేల యేళ్ల చరిత్రను తెలుపుతుంది. ఆయన అప్పటి ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులను చక్కగా వర్ణించాడు. ఆనాటి రాజదర్బారులో జరిగే రాజకీయ కుతంత్రాలకు అప్పటి మనోభావాలకు సంబంధించిన ముచ్చటైన సంఘటనలను కొన్నింటిని మనకు అందిచ్చాడు. "స్వర్గంలో కూడా దుర్లభమైన విద్య, ఉత్తుంగ భవనాలూ, కుంకుమ పువ్వు, జివ్వుమనే నీళ్లు, ద్రాక్షపండ్లు కాశ్మీరులోనే దొరుకుతా"యని కల్హణుడు ఒకచోట వ్రాశాడు.

చిత్రవిచిత్రాలతో నిండిన సుదీర్ఘ చరిత్ర కాశ్మీరుది. ప్రథమంలో అక్కడ హిందూ మతం విస్తరించినా క్రీస్తుకు పూర్వం మూడో శతాబ్దంలో అశోక చక్రవర్తి కాలంలో బౌద్ధమత ప్రాభవం నిలదొక్కుకొంది. వెయ్యేళ్ల, తర్వాత చీనాయాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ప్రయాణించిన సమయంలో బౌద్ధమతం దిగజారిపోతున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. అక్కడ మూఢనమ్మకాలూ, ఆచారాలూ పాతుకోపోయినవని ఆయన రాశాడు. ఆ సమయంలో శైవ మతాచారాలు ముఖ్యమైనాయి. అటు పిమ్మట వచ్చిన రాజులలో 8వ శతాబ్దంనాటి లలితాదిత్యుడు ముఖ్యుడు. మధ్య ఆసియానంతటినీ జయించి, లలితాదిత్యుడు ఉత్తర భారతదేశం చేరి, వీలయినంత ఆక్రమించి, చివరికి కాశ్మీరు చేరాడు.

పదో శతాబ్దంలో కాశ్మీరును ఒక స్త్రీ కూడా పరిపాలించింది. ఆమె పేరు "రాణీ దిద్దా". ఆమెది కత్తికి ఎదురులేని పాలనట! కానీ ఆమె పరిపాలనలో చెప్పుకోతగ్గ లోపాలేమీ లేవు. పదమూడో శతాబ్దంలో కాశ్మీరు ప్రాంతం

మహమ్మదీయుల ప్రభావంలోకి వచ్చింది. మహమ్మదీయ రాజులలో చాలా ప్రఖ్యాతి గాంచినవాడు జైన్ - ఉల్ - అబ్దిన్. అన్యమత సహనంవల్ల, కళలను, చేతిపనులను ప్రోత్సహించటంవల్ల అతడు ప్రఖ్యాతి గాంచాడు. ఆ తర్వాత, మొగలాయీలు కాశ్మీరాన్ని ఆక్రమించి ఆ దేశంమీద తమకున్న అభిమానాన్ని మసీదులు కట్టించి, ఉద్యానవనాలను పెంచి కాశ్మీరుని ఒక మరుపురాని దేశంగా మార్చివేశారు. వారి తర్వాత ఆఫ్ఘన్ దేశస్థులు ఈ దేశాన్ని ఏలారు. వారి కాఠిన్యం దోపిడీతనం ఈనాటికీ చెప్పుకుంటారు. కాశ్మీరీలు ఈ క్రూరత్వాన్ని సహించలేక రంజిత్‌సింగ్ సహాయమర్థించారు. తత్ఫలితంగా 20 యేళ్ల సిక్కుల పరిపాలన కూడా కాశ్మీరుకు లభించింది. 1846 లో రాజా గులాబ్‌సింగ్ రావి సింధునదుల మధ్య ప్రాంతమంతటినీ ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి 75 లక్షల రూపాయలకు కొన్నాడు. 1947 వరకూ ఆ ప్రాంతమంతా అతని వారసుల అధీ





నంలోనే ఉంది. దేశ విభజన సమయంలో కాశ్మీరు భారతదేశంలో విలీనమై పోయింది. ఇప్పుడక్కడ మూడు సాంస్కృతిక విభాగాలు కనిపిస్తాయి. జమ్ము, కాశ్మీర్, లదాక్ - ఈ మూడూ కలిసి జమ్ము-కాశ్మీర్ రాష్ట్ర మేర్పడింది.

కాశ్మీరులో చాలా సరస్సులున్నాయి. వాటిలో దాల్ సరస్సు చాలా పేరు మోసింది. దీనిమీద ముఖ్యపట్టణమైన శ్రీనగర్‌లోని రెండు భాగాలనూ కలిపే పురాతనమైన వంతెనలున్నాయి. నదిలో అక్కడక్కడ చిన్నచిన్న ముచ్చటైన లంకలున్నాయి. వాటిలో అతి ప్రఖ్యాతమైనది 'చార్ చీనార్' అనేది. ఆ లంకలో నీటిమీదకు వ్యాపించిన నాలుగు సమున్నతమైన చీనార్ చెట్లు ఉన్నాయి. నెహ్రూ ఉద్యానవనమున్న లంక కూడా అలాంటిదే.



అనేక కాశ్మీరీ కుటుంబాలకు నివాస స్థలాలుగా ఉన్న గృహనావలు (హౌసు బోట్లు) ఈ సరోవరమంతటా ఉంటాయి. యాత్రా సమయంలో అద్దెకు దొరికే గృహనావలు కూడా వీటి పక్కపక్కల ఉంటాయి. ఇవి చావడి, పడక గదులు, స్నానాలగది, వంటగది వంటి ప్రత్యేక వసతులతో నివాస యోగ్యమై ముచ్చటగా కూడా ఉంటాయి. కొన్ని నావలలో చిన్న చిన్న తోటలు కూడా వున్నాయి. వీటిలో గుమ్మడి, పుచ్చ, చిక్కుడు మొదలైన కూరగాయల్ని పెంచుతారు. ప్రత్యేకమైన 'షికారాలలో' మిగిలిన తిండి సరకులను పొలాలనుంచి, దగ్గరి పండ్ల తోటలనుంచి, తెచ్చి సమకూరుస్తారు. ఈ చిట్టి నావలు కాశ్మీరుకి మాత్రమే ప్రత్యేకమైన చదునైన అడుగుభాగం గల చిన్న పడవలు. ఈ వసతులున్న ఆ షికారాలు తెల్లవారు జామునే అన్ని రకాల కూరగాయలూ, పండ్లూ నింపుకొని చడీ చప్పుడు కాకుండా, గృహనావల మధ్య చిరచిర తిరుగుతూ వుంటాయి. కొన్ని సమయాల్లో బాతులతోను, మరికొన్ని వేళల్లో గులాబీ గంగరావి, ఐరిస్, రోడో డెండ్రాన్ పూలతోను నిండిన షికారాలను చూడవచ్చు.

కాశ్మీరులోని మరొక ప్రఖ్యాతమైన సరస్సు ఊలార్. ఆసియా ఖండంలోని మంచినీటి సరస్సులన్నింటిలోనూ ఇది పెద్దది. ఝీలంనది దీనిగుండా ప్రవహిస్తుంది. రెల్లుపొదల్లో, నీటిచెట్లలో విశ్రమించే అడివి బాతులు, అడివి పక్షులు, పర్వతాల మధ్య ఉన్న ఈ సరస్సులో మందలు మందలుగా విహరిస్తుంటాయి. ''మహాశీర్'' అనే ఒక రకం చేపలు ఇక్కడ దొరుకుతాయి. ఈ చేపలు కాశ్మీరులో తప్ప మరెక్కడా లేవు.

కాశ్మీరులో మరొక మరపురాని దృశ్యం–మానససరోవరం దట్టంగా మంచు బట్టి, వెండిలా మెరిసే కొండలు ఈ సరోవరం వెనుక గంభీరంగా కానవస్తాయి. ఇక సరస్సంతా ఎఱ్ఱటి కమలములతో నిండి వుంటుంది. ఈ ఎఱ్ఱదనం వెనుక



ఆ మంచు కొండల వెండివెలుగు చూడటానికి ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. కాశ్మీరులో ప్రకృతిలోని అత్యద్భుత దృశ్యాలన్నీ విభిన్న రూపాలలో కన్నుల పండువుగా కానవస్తాయి.




26,656 అడుగుల ఎత్తుగల 'నంగా' పర్వతము వంటి ఉత్తుంగ శృంగాల నుంచి బాల్టోరోలాటి పెద్ద మంచు నదులవరకు గల సుందర దృశ్యాలు కానవస్తాయి.



ఈ మంచు నదులు పెద్ద రాతి గోడలను రాచుకుంటూ పోతాయి. ఆ విధంగా రాతి బండలు నునుపెక్కి, చూడ అందంగా వుంటాయి. ఈ దేశమంతటా నీటిబుగ్గలు కూడా ఉన్నాయి. నిర్మలతా శీతలత్వాలకూ, కొన్ని సమయాల్లో ఔషధ ప్రయోగానికీ పేరు మోసిన వేరినాగ్, అనంతనాగ్, కోకర్‌నాగ్ వంటి నీటిబుగ్గలు అనేకంగా ఉన్నాయి. అసంఖ్యాక జలబిందువులతో ప్రతి వస్తువునూ శీతలమయం చేసే ప్రవాహవేగంతో జాలువారుతున్న జలపాతాలు కూడా ఇక్కడ ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతమంతటా ఈ విశాల రాష్ట్ర సాంస్కృతిక చరిత్రను సంస్మరింపజేసే అమూల్య శిధిలాలు కానవస్తాయి. పురాతన కట్టడాలూ, మందిరాలూ, గోపురాలూ, మసీదులూ, ఉద్యానవనాలూ చరిత్ర పుటల్ని తెరిచి చూపిస్తాయి. అక్కడ పెంపొందిన మత సాంస్కృతిక వైవిధ్యాలని విశదీకరిస్తాయి. ఈ భిన్నత్వంలో ఏకత్వం సానిక సౌందర్యంతో కలిసి, మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది.






కాశ్మీరు రాష్ట్రానికి చలికాలపు రాజధాని జమ్మూ నగరం. ఇది తావీనది కుడిఒడ్డున ఉంది. పచ్చని వరిపొలాలు, పసుప్పచ్చని ఆవతోటలు కనిపిస్తుండే కొండవాలు మీద ఈ నగరాన్ని నిర్మించారు. అక్కడక్కడ మామిడితోపులున్నా

నగరంలో ఎక్కువగా కనిపించేవి ఆకాశాన్నంటే అసంఖ్యాకమైన గుడి గోపురాలే.

ఆయా కాలాలలో రాజు మెప్పుతో అన్న మొదటి మాటలనే ఒక స్థలానికి పేరుగా పెట్టటం ఆధారంగా ఉండేది. అనేక ప్రదేశాలకున్న వర్ణనాత్మక నామధేయాలకు బహుశా అదే కారణం కావచ్చు. మచ్చుకు, 'గుల్మార్గ్' అంటే 'పూలబాట'; 'సోనామార్గ్' అంటే 'బంగారపు మైదానం' పేరుమోసిన మొగలాయీ తోటలకు వచ్చిన పేరు 'చష్మాషాహీ' - అంటే 'నీటిబుగ్గలమేటి'; 'షాలిమార్' అంటే 'ప్రేమ నిలయం'; 'నసీంబాగ్' అంటే మలయ మారుతం వీచే ఉద్యానవనం, 'నిషత్ బాగ్' అంటే 'ఆనందోద్యానం'.


కాశ్మీరుని పరిపాలించిన రాజవంశాలన్నిటిలో మొగలాయీలే ప్రకృతి సౌందర్యంతో నిండిన ఈ ప్రాంతాన్ని మానవ ప్రయత్నంవల్ల ఇప్పుడిగా



ముమ్మడిగా సౌందర్యవంతం చేసి తమ ప్రేమాభిమానాలకు శాశ్వతత్వం కల్పించాలని కంకణం కట్టుకొన్నారు.

వారి కాలంలో దాల్ సరస్సు చుట్టు పక్కల 777 ఉద్యానవనాలు వేయించారని చెబుతారు. చుట్టూ ఉన్న సహజ ప్రకృతివల్ల తాము వేయించిన పూలతోటల సౌందర్యాన్ని అభివృద్ధి చేశారు. వారి కృషి ఫలితంగా కాశ్మీరు సౌందర్యం అయిదురెట్లు ఇనుమడించబడింది. వెనుకగా దేవదారు జాతి చెట్లు పెరిగే








పర్వతశ్రేణులున్న ఈ తోటలు, సుదూరాన మంచుతో కప్పిన పర్వత శిఖరాలను నిర్మల జలాల్లో ప్రతిబింబించే దాల్ సరస్సు మహనీయ దృశ్యాన్ని చూసి ఎవరు తన్మయత్వం పొందరు? రంగు రంగుల పువ్వుటంచులు గల పర్వత సోపానాల మీద నిర్మితమైన ఈ తోటల్లో, నీళ్లు విరజిమ్మే నీటి బుగ్గలూ ఒక సోపానం నుంచి మరో దాని మీదికి మర్మర ధ్వనులతో జాలువారే సెలయేళ్ళూ, ఉన్నాయి. అక్కడక్కడా పెద్ద పెద్ద మంచలు ఏర్పాటయి వున్నాయి. ఇవి అద్భుతమైన పూల మండపాలు. ఈ సుందర దృశ్యాన్ని ఎంత చూసినా తనివి తీరదు.


ఈ ప్రాంతంలోని ప్రకృతి దృశ్యాలను అలంకరించే స్మారకచిహ్నాలను తమ ఉనికి వల్ల దృశ్య సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసే చోటుల్లోనే నిర్మించారు. దేవాలయాలను, మసీదులను పూర్వం శిథిలాల స్థానంలోనే కట్టారు. మరొక

విశేషమేమిటంటే మహమ్మదీయ గోరీలు హిందువుల దేవాలయాలు ప్రక్క ప్రక్కనే కనబడతాయి.

ఆ విధంగా ఆ ప్రదేశం హిందువులకు, మహమ్మదీయులకూ, సమానంగా పవిత్ర స్థలమై, ఉభయ మతాల వారికీ యాత్రా కేంద్రమైంది. మనదేశపు చారిత్రిక, వైజ్ఞానిక, మతైక సామరస్య మేళవింపును కాశ్మీరు వేయినోళ్ల చాటుతున్నది.

దీనికి ఉదాహరణ శంకరాచార్య మందిరం. వెయ్యి అడుగుల యెత్తైన కొండ మీద కట్టిన ఈ మందిరం నుంచి శ్రీనగరపట్టణం అంతటినీ చూడవచ్చు. దీన్ని క్రీస్తుకు పూర్వము రెండువేల యేళ్ళ కిందట బహుశః "సందిమాన్" కట్టించి







ఉండవచ్చు. అయితే దీన్ని కాలక్రమాన చాలాసార్లు తిరిగి కట్టటం జరిగింది. ఈ మందిర నిర్మాణం జరిగిన కొండను మహమ్మదీయులు కూడా పవిత్ర స్థలంగా భావిస్తారు. బౌద్ధులు కూడా ఈ కొండ మీద ప్రార్థనలు చేస్తారు.

అవంతీపూర్, మార్తాండ అనే మందిరాలు శిథిలాలుగా పడివున్నాయి. మార్తాండ మందిరమనే సూర్యదేవాలయం క్రీస్తుకు పూర్వం మూడువేల యేళ్ల నాటి శిథిలాలయం మీద పునర్నిర్మితమయింది.

అయితే ఇప్పుడు కనిపించే శిథిలాలయ నిర్మాణాన్ని ఎనిమిదో శతాబ్దినాటి లలితాదిత్యుడు కట్టినదే. ఈ దేవాలయం ఒక ఎత్తైన ప్రదేశంమీద కట్టబడి వుంది. చుట్టూ దిగువను మైదాన ప్రదేశం ఆవరించి వుంది. దేవాలయం నుంచి క్రింది వైపుకు చుట్టూ కలియజూస్తే, ఆ దృశ్యం మనోహరంగా వుంటుంది.







కుతుబుద్దీన్ పద్నాలుగో శతాబ్దంలో ''షాహమ్‌దాన్'' మసీదును కట్టించాడు. కానీ దాన్ని పునర్నిర్మించారు. కాళికాదేవికి అంకితమైన ఒక నీటి బుగ్గ (స్ప్రింగ్) కూడా ఇక్కడ ఉంది. పూజకోసం యాత్రికులిక్కడికి వస్తుంటారు.

జీవితాంతంలోగా ఒక్కసారి మాత్రం యాత్రకుపోయి ఆత్మలను పరిశుద్ధం చేసుకోవాలని హిందువులూ, మహమ్మదీయులూ భావించే యాత్రాస్థలాలు అమ్మర్‌నాథ్, హజరత్‌బాల్ అనేవి రెండు. మొదటి దాంట్లో మంచుతో ఏర్పడ్డ శివలింగం ఉంది. దాదాపు వెయ్యి సంవత్సరాలుగా ఇక్కడకు భక్తులు యాత్రలు చేయటం ఆచారం అయిందని కల్హణుడు తన గ్రంథంలో వ్రాశాడు.



హజరత్ బాగ్‌లో మహమ్మద్ ప్రవక్త తలవెంట్రుక భద్రపరచి ఉందని లక్షలాది ఇక్కడికి చేరుతుంటారు.

చోర్టన్లు అనే స్మారక చిహ్నాలు లదాక్‌కు బాగా ఉత్తరాన కనిపిస్తాయి. ఇవి వెల్లవేసి తెల్లగా వుంటాయి. ఇక్కడ బౌద్ధమత లామా ఋషులను సమాధి చేశారు.



వారి భస్మాన్ని మట్టితో కలిపి ఆవంలో కాల్చి బుద్ధ చిత్రం అముద్రితం చేశారు. ఆ పరిసర ప్రాంతాల్లో చెదురు మదురుగా 'ఓం మణి పద్మే హుం' అనే ప్రార్థనా చరణం చెక్కిన ప్రార్థనా కుడ్యాలు కనిపిస్తాయి. దీని అర్థమేమిటంటే,— "దేవుడు పద్మాకారంలో ప్రార్థనా చక్రరూపంలో వున్నాడు. చక్రం ప్రతి ఒక్క చుట్టుకూ ఒక్కొక్క ప్రార్థన చొప్పున స్వర్గానికి పంపబడుతాయి" అని.



కాశ్మీరీలు అనుక్షణం జ్ఞాపకం చేసుకొంటూ మురిసిపొయ్యే కథ ఒకటుంది. జహంగీరును అంత్యసమయంలో చివరి కోరిక అడిగితే "కాశ్మీర్ ఒక్కటే" అన్నాడని, వెనువెంటనే మరణించాడని, చెప్పుకుంటాడు.

సూర్యుడస్తమిస్తున్నాడు.... ఆకాశం క్షణంపాటు బంగారం వన్నెలో మారుతోంది. మసక చీకటి నీడలు పొడుగవుతున్నాయి. చీకట్లు కమ్ముకుంటున్నాయి. సరోవరంపై నావికుడు (షికారా) నిశ్శబ్దంగా నావను నడిపించుకు పోతున్నాడు.

దూరంగా బంగారు పిచ్చుక కూత, కప్పల బెకబెకలు వినిపిస్తున్నాయి. వాతావరణం ఎంతో నిశ్శబ్దంగా వుంది. మరువలేని కాశ్మీర దృశ్యాలు మనస్సులో మెదులుతూ వుండగా, మనం యిక కాశ్మీరు నుంచి శెలవు పుచ్చుకుందాము.



Printed at Pearl Offset Press Pvt. Ltd
Kirti Nagar Indl. Area, New Delhi-